## మామిడి సాగుపై రైతులకు అవగాహన



చల్మెడలో మామిడి తోటను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీనివాస్ రావు

నిజాంపేట, ఆగస్టు 3 : మామిడి సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు రైతులకు సూచించారు. మండలంలోని చల్మెడ గ్రామాన్ని డీఆర్డీవో శనివారం సందర్శించారు. హార్టికల్చర్‌లో భాగంగా గ్రామ రైతులు సాగు చేస్తున్న మామిడి తోటను పరిశీలించారు. మామిడి సాగుకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సాగు విస్తీర్ణం పెంచే దిశగా హార్టీకల్చర్ సిబ్బంది కృషి చేయాలన్నారు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలన్నారు. ఆయన వెంట నిజాంపేట ఎంపీడీవో రాజిరెడ్డి, ఏపీవో శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ శశిరేఖ తదితరులు ఉన్నారు.

## పాఠశాలల్లో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



నిజాంపేట: బోనాలు, పోతరాజుల వేషధారణలో విద్యార్థులు

నిజాంపేట, ఆగస్టు 3 : మండల పరిధిలోని నగరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో శనివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పాఠశాల ఆవరణలో బోనాల ఊరేగింపు, పోతరాజు విన్యాసాలు అందరినీ అకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్యదర్శి ఆరిఫ్ హూస్సేన్, హెచ్‌ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, విద్యార్థులు ఉన్నారు.

రేగోడ్, ఆగస్టు 3 : ఆషాఢమాసం పురస్కరించుకొని తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల్లో భాగంగా శనివారం రేగోడ్ ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించారు. బోనాలను తయారు చేసి పోతరాజుల వేషాధాణతో నృత్యాలు చేశారు. బోనం ఎత్తుకుని విద్యార్థులు ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు అంజుబాబు, అశోక్, సందీప్, స్వప్న పాల్గొన్నారు.



రేగోడ్: బోనాల సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

## బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శికి సన్మానం



కార్యదర్శిని సన్మానించిన మాజీ ప్రజాప్రతినిధులు

నిజాంపేట, ఆగస్టు 3 : మండల పరిధిలోని నందిగామ పంచాయతీ కార్యదర్శిగా మహ్మద్ ఆరిఫ్ ఐదేండ్లుగా పని చేసి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పంచాయ తీ కార్యాలయ ఆవరణలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శిని సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు ప్రీతి, సురేశ్‌కుమార్, రా జం, సంపత్, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమ, గ్రామస్తులు తిరుమ ల్, రమేశ్, దయాకర్, స్వామి, లింగుస్వా మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల పిన్సిపాల్‌కు సన్మానం

చిన్నశంకరంపేట, ఆగస్టు 3 : చిన్నశంకరంపేటలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ బదిలీపై మేడ్చల్-మాల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ జూనియర్ కళాశాలకు వెళ్లారు. శనివారం చిన్నశంకరంపేట జూనియర్ కళాశాల అధ్యాపకులు ఆయనను కుత్బుల్లాపూర్ కళాశాలలో కలిసి సన్మానించారు.



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

# పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- 23 వరకు ఆర్‌వోఆర్ నూతన ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలు తీసుకోవాలి
- సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్
- కలెక్టర్, జిల్లా అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

మెదక్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ భూ సమస్యల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో ఇప్పటివరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించాలన్నారు. నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును రూపొందించి ప్రజలకు అందుబాటులో ఆన్‌లైన్‌లో పెట్టిందన్నారు. నూతన చట్టం ముసాయిదా కింద సెక్షన్ 4 ప్రకారం కొత్త ఆర్‌వోఆర్ రికార్డ్ రూపకల్పన, అందుబాటులో ఉన్న రికార్డ్ సవరణకు అవకాశం ఉందని తెలిపారు. గత చట్టం కింద నిలిచిపోయిన సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి సెక్షన్ 6 వెసులుబాటు కల్పించిందన్నారు. సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో ముసాయిదా బిల్లు అందుబాటులో ఉందన్నారు. ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై ప్రజల సలహాలు సందేహాలు, అభిప్రాయాలను సీసీఎల్ఏ వెబ్ సైట్ www.ccla.telangana.gov.in ద్వారా లేదా ror-rev<\@>telangana.gov.in మెయిల్ ద్వారా ఈ నెల 23 వరకు తెలియజేయాలని ఆయన తెలిపారు.

### సూచనలు, సలహాలు ఇవ్వండి

అదనపు కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన సలహాలు సూచనలు సకాలంలో అందజేయాలని సీసీఎల్ఏ కమిషనర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు సలహాల మేరకు కొత్త చట్టాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. నూతన ఆర్‌వోఆర్ చట్టం అమలుల్లోకి వచ్చే లోపు పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. మరో 3 వారాల వ్యవధిలో పూర్తిస్థాయిలో ధరణి దరఖాస్తులు పరిష్కారమయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. ఆ దరఖాస్తులను తిరస్కరిస్తే తప్పనిసరిగా కారణాలు తెలియజేయాలని అధికారులకు సూచించారు.

### సకాలంలో పరిష్కరిస్తాం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో ధరణి ద్వారా మొత్తం 74,510 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిలో ఇప్పటివరకు 45,145 దరఖాస్తులను ఆమోదించామన్నారు. 20,179 దరఖాస్తులను తిరస్కరించామని తెలిపారు. ప్రస్తుతం ధరణి దరఖాస్తుల పెండింగ్‌లో అదనపు కలెక్టర్ స్థాయిలో 1,001, రెవెన్యూ డివిజన్ అధికారుల స్థాయిలో 575, తహసీల్దార్ల వద్ద వద్ద 619 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని సకాలంలో పరిష్కరిస్తామని, తిరస్కరించే దరఖాస్తులపై తప్పనిసరిగా కారణం తెలియజేస్తామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్‌డీవో రమాదేవి, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నర్సాపూర్, ఆగస్టు 3: నర్సాపూర్ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ తొంట వెంకటేశం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. తొంట వెంకటేశం అంత్యక్రియలు నర్సాపూర్ పట్టణంలో శనివారం జరిగాయి. ఈ అంత్యక్రియలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ యువనాయకుడు సంతోష్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన శాఖ జిల్లా అధికారిగా ప్రతాప్‌సింగ్



కలెక్టర్‌ను కలిసిన ప్రతాప్‌సింగ్

మెదక్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : హార్టికల్చర్ (ఉద్యాన వన) శాఖ మెదక్ జిల్లా అధికారిగా ప్రతాప్‌సింగ్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించి కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన ప్రతాప్‌సింగ్‌ను మెదక్ జిల్లాకు బదిలీ చేయగా... ఇప్పటి వరకు మెదక్‌లో విధులు నిర్వహించిన హార్టికల్చర్ ఆఫీసర్ నర్సయ్యను కార్పొరేట్ ఆఫీసుకు బదిలీ చేశారు.

## సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీలత



మెదక్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : మెదక్ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీలత శనివారం బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్‌గా రెండున్నరేండ్లు పనిచేసిన శ్రీలత రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా మెదక్ సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు. ఇప్పటివరకు మెదక్‌లో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన శ్రీలత సిద్దిపేట సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్‌లు చేస్తామని తెలిపారు.

# అంగన్‌వాడీల్లో ప్రీ స్కూళ్లు

- మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి బ్రహ్మాజీ
- అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, అన్నప్రాసన, సీమంతాలు



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి బ్రహ్మాజీ

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 3 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం ప్రీ స్కూలు విద్యా బోధన జరుగుతున్నదని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి బ్రహ్మాజీ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పిట్లంబేష్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, కౌమార దశలోని బాలికలకు పౌష్టికాహారం అందించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో నీలిమా, మున్సిపల్ కౌన్సిలర్ గాయత్రి, సూపర్‌వైజర్ జయంతి, అంగన్‌వాడీ టీచర్లు రేణుకా, స్మరణ, మహిళా శక్తి కేంద్రం బాధ్యులు సంతోషిణి, సఖి సెంటర్ బాధ్యులు రేణుకా, ఆశ వర్కర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

## బోధన సామర్థ్యాల పెంపు కోసమే సమావేశాలు



మాసాయిపేట సమావేశంలో పాల్గొన్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

వెల్దుర్తి, ఆగస్టు 3 : బోధన సామర్థ్యాల పెంపు కోసమే కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. వనివారం మాసాయిపేటలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశంలో బోధనలో కొత్త మెళకువలను నేర్చుకోవచ్చని తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ వారు నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా విద్యార్థులు పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చి మంచి ఫలితాలను సాధించేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో మండల నోడల్ అధికారి రాజేశ్వర్‌రావు, పాఠశాల హెచ్‌ఎం ధర్మపురి కాంప్లెక్సు రిసోర్స్ పర్సన్ రంగారెడ్డి, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన విద్య

చిన్నశంకరంపేట, ఆగస్టు 3 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. శనివారం మండల పరిధి సూరారం చిన్నశంకరంపేటలో నిర్వహిస్తున్న జీవశాస్త్రం ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంవో సుదర్శనమూర్తి జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు సాయిరెడ్డి, దీపా, నర్సింహులు, లక్ష్మణ్,రవి, రాజిరెడ్డి, చేగుంట, చిన్నశంకరంపేట మండలాల జీవశాస్త్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనాన్ని అందించాలి

చిన్నశంకరంపేట, ఆగస్టు 3 : మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. శనివారం చిన్నశంకరంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా ఆయన తిని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



రామాయంపేట: సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దేవేందర్

రామాయంపేట, ఆగస్టు 3: మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని రామాయంపేట పురపాలిక కమిషనర్ మామిడి దేవేందర్ పేర్కొన్నారు. శనివారం పురపాలిక సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. మున్సిపల్ వార్డు అధికారులు, ఆర్పీ తదితర సిబ్బంది ఈ నెల 5నుంచి 9వరకు వార్డుల్లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి వార్డులో మొక్కలు నాటడమే లక్ష్యంగా వార్డు అధికారులు పనులు చేపట్టాలన్నారు. ఇంటింటికీ మొక్కలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నర్సాపూర్‌లో..

నర్సాపూర్, ఆగస్టు 3: నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 9వరకు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనే వార్డు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ జైత్‌రాంనాయక్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

### కౌడిపల్లిలో..

కౌడిపల్లి, ఆగస్టు 3 : కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం, పచ్చదనం నిర్వహించి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఏపీఎం సంగమేశ్వర్, ఏసీవో పుణ్యాదాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## దానంపై చర్యలు తీసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 3 : ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీలో వీధి రౌడీలా మాట్లాడిన తీరు బాధాకరమని మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలకు దిగుతూ, సభ మర్యాదలను, సభా గౌరవాన్ని కాంగ్రెస్ పార్టీ మంటగలిపిందన్నారు. గౌరవ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నాగేందర్‌పై స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అది 'బోగస్ క్యాలెండర్'

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 3 : రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా శాసనసభలో విడుదల చేసింది జాబ్ క్యాలెండర్ కాదని, జాబ్‌ల సంఖ్య లేని 'బోగస్ క్యాలెండర్' అని బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి కిరణ్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌పై సభలో చర్చ జరపాలని గౌరవ సభ్యులు కోరితే కేవలం తేదీలు ప్రకటించి తప్పించుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలు కూడా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన నోటిఫికేషన్లని గుర్తు చేశారు.

## నిమ్స్‌లో కేజీబీవీ విద్యార్థినికి చికిత్స

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 3 : స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మానస గత నెల 31న అనారోగ్యానికి గురయింది. కళాశాల సిబ్బంది మందులు ఇచ్చినా తగ్గకపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు ప్రైవేట్ వైద్యుడి వద్ద చూయించినా తగ్గకపోవడంతో మెదక్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. శుక్రవారం విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యార్థినికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. వెంటనే ఆయన మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించారు. మానస కోలుకుంటున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి కవిత తెలిపారు.

## రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

పెద్దశంకరంపేట, ఆగస్టు 3 : ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పేట ఎస్సై శంకర్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు రోడ్డు భద్రత జీవితానికి భద్రత అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ మేనేజర్ ఖాజా మైనోద్దీన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండు బస్సులు ఢీ

మెదక్ అర్బన్, ఆగస్టు 3 : రెండు బస్సులు ఢీ కొన్న ఘటన మెదక్ పట్టణంలోని తారకరామనగర్ కాలనీలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... మెద క్ పట్టణంలోని డాన్ బాస్కో స్కూల్‌కు చెందిన బస్సు, సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొన్నాయి. పాఠశాల బస్సులో పిల్లలు లేకపోడంతో ప్రమాదంలో ఎవరికీ ఏమి కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 3 : పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. శనివారం మెదక్‌లో ఫాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా సంజీవ్‌రావు, ఉపాధ్యక్షుడిగా థియోడర్, కార్యదర్శులుగా సాలోమాన్, యోబు, కోశాధికారిగా హెన్నీపాల్‌ను ఎన్నుకున్నారు.

## జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాలకృష్ణారెడ్డి



చేగుంట,ఆగస్టు 3 : చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాలకృష్ణారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. చేగుంట ప్రిన్సిపాల్‌గా పనిచేసిన హరిప్రసాద్ కొండపాకకు బదిలీపై వెళ్లారు.

## నర్సాపూర్ ఎస్సైగా లింగం



నర్సాపూర్, ఆగస్టు 3 : నర్సాపూర్ ఎస్సైగా బి.లింగం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలు కాపాడడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

### వెల్దుర్తి ఎస్సైగా రాజు



వెల్దుర్తి, ఆగస్టు 3 : వెల్దుర్తి ఎస్సైగా టి. రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్ నుంచి బదిలీల్లో భాగంగా వెల్దుర్తికి వచ్చారు. వెల్దుర్తి ఎస్సైగా విధులు నిర్వహించిన నవత బదిలీపై జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు.

## బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ చెక్కుల అందజేత



కాస్లాపూర్‌లో బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ,రాజేష్ తదితరులు

చేగుంట, ఆగస్టు 3: బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను నార్సింగి ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల నాయకుడు రాజేశ్ అందజేశారు. నార్సింగి మండలం కాస్లాపూర్ గ్రామానికి చెందిన శంకర్, సిద్దిరాములు, మల్లేశంలు ఇటీవల అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందారు. దవాఖానలో ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవడంతో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంత్‌రావుల సహకారంతో మంజూరైన రూ.75వేల చెక్కును శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రాజేశ్, స్వామి, సుధాకర్, చందు తదితరులున్నారు.

## విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు

చిన్నశంకరంపేట, ఆగస్టు 3 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు వెలికి తీయాలని మెదక్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు సూచించారు. ఆయన ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గజగట్ల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు

నిజాంపేట, ఆగస్టు 3 : విద్యుత్ షాక్‌కు గురై రైతుకు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని ఖాసీంపూర్ తండాలో శనివారం జరిగింది. స్థానికులు రైతులు తెలిపిన వివరాలు... తండాకు చెందిన ధరావత్ శంకర్ తన వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ బిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు షాక్ రావడంతో ఛాతీ భాగంలో తీవ్రగాయమై రక్తస్రావం జరిగింది. గమనించిన తోటి రైతులు గాయపడిన శంకర్‌ను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

### మెదక్-బొడ్మట్‌పల్లి రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించాలి

పాపన్నపేట, ఆగస్టు 3 : అల్లాదుర్గం -మెటల్‌కుంట, మెదక్-బొడ్మట్‌పల్లి రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించి అభివృద్ధి చేయాలని జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జోగినాథ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రెండు రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించి నాలుగు లేన్లుగా విస్తరించాలన్నారు. ఈ రోడ్లను అభివృద్ధి చేస్తే ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ తో పాటు కర్ణాటక మహారాష్ట్రలోని ప్రాంతాలకు వెళ్లడానికి సులువుగా ఉంటుందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రులు , నితిన్ గడ్కరీ, బండిసంజయ్ ,రఘునందన్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఆయన వెంట రవిశంకర్, బస్వరాజ్ తదితరులు ఉన్నారు.

## పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలి



డి.ధర్మారంలో సభ్యత్వాన్ని అందజేస్తున్న టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్

రామాయంపేట, ఆగస్టు 3 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం డి.ధర్మారం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గతంలో ప్రకటించిన మాదిరిగానే పీఎస్ హెచ్‌ఎంల పోస్టులను వెంటనే మంజూరు చేయాలన్నారు. టీచర్లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మెంగర్తి ప్రణీద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బైతి ఐలయ్య, నాగేందర్, నర్సింహారావు, విఠల్, శేఖర్, మోహన్ శర్మ, నవీన్ రత్నాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కౌడిపల్లి, ఆగస్టు 3 : ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్, ఏఆర్, పోలీసు సిబ్బందితో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో వెళ్తే జరిమానా విధిస్తామన్నారు.

## గుంతలను పూడ్చివేసిన పోలీస్ సిబ్బంది



.రేగోడ్, ఆగస్టు 3: మండల పరిధిలోని పోచారం నుంచి గజ్వాడ వరకు రోడ్డు గుంతలమయమైంది. శనివారం సీఐ రేణుకా,ఎస్సై రాజయ్య పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాదారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా టిప్పర్లతో మొరం వేయించి గుంతలను పూడిపించారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PUBLIC HEALTH CHEMICALS**
టెమీ ఫాస్ 50% EC, మలాతియన్ 50% EC, పైరిత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc. మునిసిల్ కార్పొరేషన్స్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును. డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు
9346771599, 8790185234, 9701298656

**PLOT FOR SALE**
★10 వేలకే 6 లక్షల రూపాయల 121 గజాల ప్లాట్, లక్ష రూపాయల ఎలక్ట్రిక్ స్కూటర్ సొంతం చేసుకోండి. యాదగిరిగుట్ట, కొమరవెల్లి, నారాయణఖేడ్. Ph: 9128245456.
NT-325780

**WATER PROOFING**
★Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124

**WANTED**
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325779-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.